క్లుప్తంగా

మూగబోయిన సెల్‌ఫోన్స్



జియో టవర్

జైనథ్: మండ కేంద్రంతోపాటు, నిరల, మకోడా గ్రామాలకు శనివారం నుంచి మొబైల్స్‌కు సిగ్నల్ రావడం లేదు. మానవ జీవన మనుగడులో మొబైల్ ఒక్క అలవాటుగా మారుతున్న తరుణంలో జియో సిగ్నల్ రాకపోవడంతో ఇబ్బంది పడ్డారు. శనివారం కురిసిన భారీ వర్షానికి వైర్లు తెగిపోవడంతో సిగ్నల్ సమ స్య త లెత్తింది. సుమారుగా 18 గంటల పాటు సిగ్నల్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

జలదిగ్బంధంలో 'కామాయి'



వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

సాత్నాల: భారీ వర్షానికి పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహించడంతో భోరజ్ మండలం కామయి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పైనుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. లోలెవల్ వంతెన స్థానంలో హై లెవెల్ వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థికి సన్మానం



హిమబిందును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: మండలంలోని దేవుల్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన రాథోడ్ హిమబిందు ఎన్ఐటీలో ర్యాంక్ సాధించడంతో ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలో విద్యార్థిని శాలువాతో సన్మానించారు. రాథోడ్ ప్రవీణ్ కష్టపడి తమ పిల్లలను చదివించి వారికి ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజన్‌లాల్, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, దేవులనాయక్‌తండా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆహారం అందజేత



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న కార్యకర్తలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లలోని సామగ్రి పూర్తిగా తడిసిపోయింది. అలాంటి బాధితులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అండగా నిలిచారు. తన కేఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. వివిధ కాలనీల్లోని సుమారు 500 మందికి ఆహారం అందించినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెన్‌గంగ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బేల: పెన్‌గంగ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రఘునాథ్‌రావు సూచించారు. ఆదివారం మండలంలోని సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, కోగ్దూర్, గ్రామాలను సందర్శించారు. పెన్‌గంగ ఉధృతిపై ఆరా తీశారు. బ్యాక్‌వాటర్‌తో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ప్రజలు ఎప్పటిప్పుడు అప్రమత్తంగా ఉండి, తమకు సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, ఆర్ఐ సాజిది, సిబ్బంది ఉన్నారు.

వరద తగ్గింది.. నష్టం మిగిలింది

- నది పరీవాహక ప్రాంతాల్లో నీటమునిగిన పంటలు
- కోతకు గురైన వ్యవసాయ భూములు
- ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు



కచికంటి శివారు మైదానాన్ని తలపిస్తున్న చేను

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో వర్షాకాలంలో ప్రధానంగా పత్తి, సోయాబీన్, కంది, పంటలు సాగు చేస్తున్నారు. సుమారు 39 వేల ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. ఈ క్రమంలో శనివారం కురిసిన భారీ వర్షానికి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పెరుగుతున్న పంటను చూసి రైతులు ఆనంద పడ్డారు. కానీ భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

నది పరీవాహక ప్రాంతాల్లో..

మండలంలోని లాండసాంగ్వి, అర్లి (బి), కచికంటి, అనుకుంట, యాపల్‌గూడ, కొత్తూర్, తంతోలి, అంకోలి, వాన్‌వాట్, చించుఘాట్, మామిడిగూడ, పిప్పల్‌ధరి గ్రామాల శివారు ప్రాంతాల్లో వాగులు ప్రవహిస్తాయి. వాగులకు అనుకొని వందల ఎకరాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వాగులు పొంగి పొర్లడంతో వరద నీరు వ్యవసాయ పొలాల నుంచి ప్రవహించింది. దీంతో సాగులో ఉన్న పంటలు వందల ఎకరాలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి.

మైదానాన్ని తలపిస్తున్న చేనులు..

మండలంలో ప్రధానంగా 33 వేల ఎకరాల్లో పత్తి, 22 వేల ఎకరాలు సోయాబీన్, 3,900 ఎకరాలు కంది, 818 ఎకరాలు ఇతర పంటలు సాగు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో వాగులకు అనుకొని ఉన్న వ్యవసాయ పొలాల నుంచి వరద నీరు ప్రవాహించడంతో పొలాల్లో పెద్దపెద్ద బండరాళ్లు, ఇసుక పేరుకుపోవడంతో మైదానాలను తలపిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడ ఎలాంటి పంటలు సాగు చేసేందుకు వీలు లేకుండా పోయిందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



భారీ వర్షానికి వాగు పొంగి పొర్లింది. వాగుకు అనుకొని ఉన్న వ్యవసాయ పొలంలో నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలి.

– కొక్కుల లింగన్న, రైతు, కచికంటి, ఆదిలాబాద్ రూరల్

నష్టపోయిన పంటల సర్వే



భారీ వర్షానికి నష్టపోయిన పంటల సర్వే చేపట్టినం. వాగుల పరివాహక ప్రాంతాల్లో సుమారు 2,693 ఎకరాలలో పత్తి, ఇతర పంటలు నష్ట పోయినట్లు ప్రాథమిక అంచనా వేశాం. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం.

– నగేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

తాంసి: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం తహసీల్దార్ లక్ష్మి పర్యటించారు. మండల కేంద్రంతో పాటు గిరిగాం, గోట్కూరి, పొన్నారి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న ఇళ్లను, పంటలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టం వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సంతోశ్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామపెద్దలు అరుణ్, రామన్న యాదవ్, కల్యాణ్ ఉన్నారు.

సాత్నాల: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురైన పెండల్‌వాడ, మాండగాడా, పూసాయి గ్రామాల్లో ఆదివారం సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి పర్యటించారు. పూసాయి గ్రామానికి చెందిన బుర్కే ప్రవీణ్ ఇంట్లో రేషన్ సరుకులు వర్షానికి తడిసిపోగా వారికి ఆర్థికసాయం అందజేశారు. ఎవరూ అధైర్య పడొద్దని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఉధృతంగా పెన్‌గంగ



పెన్‌గంగను పరిశీలిస్తున్న తహసీల్దార్ నారాయణ

జైనథ్: మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని పెన్‌గంగ ఉధృతంగా ఆదివారం ప్రవహిస్తోంది. మండలంలోని బహదూర్పూర్ శివారులోని పెన్‌గంగను తహసీల్దార్ ఆత్రం నారాయణ పరిశీలించారు. వరద ప్రవాహంపై ఆరా తీశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత రెండు రోజుల నుంచి ఇరు రాష్ట్రాలకు రాకపోకలు నిలిపివేయడం జరిగిందన్నారు. ఆయన వెంట గ్రామాల పంచాయతీ కార్యదర్శిలు మల్లేష్, నర్సింగ్, గంగన్న, తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

భీంపూర్: భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని పిప్పల్ కోటి, నిపానీ, భీంపూర్, గోనే, వడూర్, దన్నోరా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి పరిశీలించారు. దాదాపు 15,000 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. రోడ్లకు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్ కామిని అశోక్, దాసరి రమేశ్, శ్రీధర్ రెడ్డి, కొడాల నారాయణ, కొడాల సంతోష్, దండే సుదర్శన్, రేణిగుంట శ్రీనివాస్, జై వెంకట్ రెడ్డి, అన్ను పటేల్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి



పుగిడి ఆడుతున్న స్వామీజీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గోపాలకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి పుగిడి ఆడి భక్తులను అలరించారు. అనంతరం చిన్నారులతో దహీ హండీ నిర్వహించగా.. భక్తులు ప్రసాదం కోసం పోటీపడ్డారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

భీంపూర్: పండుగలు ప్రశాతంతగా జరుపుకోవాలని సీఐ సాయినాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో అన్ని గ్రామాల గణేష్ మండప నిర్వాహకులు, యువకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గణేష్ మండపాలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, స్తంభాల వద్ద ఏర్పాటు చేయవద్దన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజే ఏర్పాటు చేయకూడదని, సూచించారు. బలవంతపు చందాలు, లక్కీ డ్రాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్సై పీర్ సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్ : వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సాయినాథ్ అన్నారు. ఆదివారం జైనథ్ పోలీస్‌స్టేషన్లో వినాయక చవితి మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నిబంధనలు పాటిస్తూ.. ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి తీసుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు ఏర్పాటు చేయవద్దన్నారు.

ఆదిలాబాద్: వినాయక నవరాత్రి వేడుకలు నిర్వహించే మండప కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రతీఒక్క మండప కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌సీ వైద్యాధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్, నాగల్‌కొండ, ముస్లింగూడ గ్రామాల్లో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట హెచ్ఈ తులసిదాస్, సిబ్బంది ఉన్నారు.

రైతులకు పరిహారం అందించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న సంగెపు బొర్రన్న

ఇంద్రవెల్లి: పంటలు వరద నీటిలో కొట్టుకుపోయి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. ఆదివారం శంకర్‌గూడ, దుబ్బగూడ గ్రామాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఎకరానికి రూ. 25 వేల చొప్పున అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు గోవర్ధన్, రేఖ, సంతోష్, వినోద్, సచ్చిదానంద్ పాల్గొన్నారు.

తాంసి: రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25వేల పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవిదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గోట్కూరిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కూలిన ఇళ్లను పరిశీలించి ధైర్యంగా ఉండాలని సూచించారు. సర్వే చేయించి, నష్టం అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. రైతులు అశోక్, భగువాండ్లు, రాజు, సురేశ్, రతన్ పాల్గొన్నారు.

పరిహారం అందేలా చూస్తాం



చెరువును పరిశీలిస్తున్న అడ్డి భోజారెడ్డి

తాంసి: నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో వరద ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అంబుగాం, తాంసి గ్రామాల రైతులతో మాట్లాడారు. ఎవరూ అధైర్య పడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట రైతులు పోచ్చిరాం, భరత్, శేఖర్, నారాయణ, సంతోశ్, రామన్న యాదవ్, ధనుంజయ్, వెంకన్న ఉన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు



కల్వర్టు వద్ద మరమ్మతులు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని గిన్నేర పరిధిలోని మర్కగూడ వాగు వద్ద ఉన్న కల్వర్టు కొట్టుకుపోగా.. ఆదివారం మర్కగూడ, తోయగూడ, బొప్పపూర్ గ్రామస్తులు శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతులు చేశారు. కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్రతిఏటా వర్షాకాలంలో కల్వర్టు కోతకు గురవుతుందని రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

తండాల్లో తీజ్ సంబురం



దేవుల్ నాయక్‌తండాలో తీజ్ సందడి



నార్నూర్ ఈఎంఆర్ఎస్ పాఠశాలలో..

బోథ్: బోథ్, సొనాల మండలాల్లోని వివిధ గ్రామాల్లో తీజ్ ఉత్సవాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు. జైనథ్ మండలంలోని కైలాస్ టేకిడి నర్మదేశ్వరుడు ఆలయంలో లింబాజీ మహరాజ్ ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. యువతులు ఉత్సాహంగా సంప్రదాయ నృత్యం చేశారు. సోనాల మండలం దేవులనాయక్‌తండాలో గోధుమ పైరుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాగుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్ రాథోడ్, మాజీ సర్పంచ్ జాదేవ్ రాంకిసాన్, జాదేవ్ రోహిదాస్, రాథోడ్ గోవింద్, రాథోడ్ సచిన్, ఆడే కిసాన్ పాల్గొన్నారు.

నార్నూర్: బంజారా గిరిజనుల ఆరాధ్య దైవంగా భావించే తీజ్ పండుగను ఆదివారం మండల కేంద్రంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంజనేయులు ప్రత్యేక పూజలు చేసి తీజ్ ఉత్సవాలను ప్రారంభించారు. తరతరాల నుంచి వస్తున్న ఆచారాలను మరిచిపోవద్దన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఓదేలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- సమాచారం ఇచ్చినా.. పట్టించుకోని అధికారులు



కచికంటి వాగులో ఇసుక తోడుతున్న దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో పలు వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. అధికారులకు 'సాక్షి' క్షేత్రస్థాయి నుంచి సమాచారం అందించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమార్కులు అందినకాడికి దండుకుంటున్నారు. పట్టపగలే ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా నేను కలెక్టర్ ప్రోగ్రాంలో ఉన్నానని, సిబ్బందిని పంపిస్తానని చెప్పారు. అప్పటి కూడా వారు అక్కడికి వెళ్లకపోవడంతో మళ్లీ 'సాక్షి' ఆయనను సంప్రదించింది. త్వరలో అక్కడికి వెళ్తానని, అనంతరం పరిస్థితిని వివరిస్తానని చెప్పడం గమనార్హం. అలాగే పంచాయతీ రాజ్ ఏఈ సంతోష్‌ను ఫోన్‌లో సంప్రదించగా తమకు ఎలాంటి సంబంధం లేదని, ఇసుక బతాన్ మాత్రమే అవసరం ఉందని తెలిపారు. దానిని సాకుగా చెప్పి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ ఎ.సంతోష్ అన్నారు. ఆదివారం మండలంలోని కుప్టి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 45 మంది గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించగా.. నలుగురికి జ్వర లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. దోమల నివారణ తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది రాణి పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన పంటలు.. దెబ్బతిన్న రోడ్లు




హీరపూర్‌లో నెలకొరిగిన మొక్కజొన్న

ఇంద్రవెల్లి: రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. మండల కేంద్రంతో పాటు అంజీ, వడగామ్, వాల్గొండ, పొల్లుగూడ, హీరపూర్, దస్నాపూర్, కేస్లాపూర్, ముత్నూర్, దుబ్బగూడ, సమాక, ఏమాయికుంట గ్రామాల్లో వాగులకు ఇరువైపులా, లోతట్టు ప్రాంతంలో సాగు చేసిన పత్తి, సోయా, మొక్కజొన్న పంటలు కొట్టుకుపోయాయి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

నార్నూర్: నార్నూర్, గాదిగూడ మండలాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. వర్షానికి వాగులు, కల్వర్టులు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పండింది. నార్నూర్ మండలంలోని బాబేఝరి చిత్తగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు కోతకు గురైంది. మల్లెంగి పరిధిలోని బారిక్‌రావుగూడ వాగులో వరద నీరు తగ్గకపోవడంతో భాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వాంకిడి బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న రోడ్డు

నేరడిగొండ మండలంలోని వాంకిడి పాత జాతీయ రహదారిపై గల వంతెన సమీపంలో రోడ్డు కోతకు గురైంది. దీంతో దారిగుండా వెళ్లే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– నేరడిగొండ